క్లుప్తంగా

ప్రతి ఇంటికీ ఉచిత వంట గ్యాస్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న మహిళా సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఇంటికీ ఉచితంగా వంట గ్యాస్ అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి నిర్మల, కృష్ణవేణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి మహిళలపై ఏ మాత్రం గౌరవం లేదన్నారు. అవగాహన లేక పౌర సరఫరాల శాఖ మంత్రి గ్యాస్‌పైన ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. గ్యాస్‌సిలిండర్ కోసం మొదట వినియోగదారుడు డబ్బు చెల్లిస్తే తర్వాత ఆ సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడం సరికాదన్నారు.

అలగనూరు జలాశయానికి మరమ్మతులు చేయించాలి

నంద్యాల(న్యూటౌన్): మిడుతూరు మండలంలో కుంగిన అలగనూరు జలాశయాన్ని వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. శుక్రవారం వారు విలేకరులతో వారు మాట్లాడుతూ జలాశయం నీటిపై వేలాది మంది రైతులు ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారన్నారు. సాగు నీటి సమస్య తలెత్తకుండా రిజర్వాయర్‌కు త్వరగా మరమ్మతులు చేయాలన్నారు.

ముగిసిన గ్యార్మీ వేడుకలు



డబ్ల్యూ గోవిందిన్నెలో జెండా తెస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె, చాకరాజువేముల గ్రామాల్లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్యార్మీ వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఆయా గ్రామాల్లో దస్తగిరిస్వామికి కులమతాలకు అతీతంగా భక్తులు జెండాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు జాకీర్‌బాషా, శివప్రసాద్ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు.

గ్రావెల్ రోడ్డు నాణ్యత పరిశీలన

చాగలమర్రి: ఉపాధి హామీ నిధులు రూ. కోటితో మల్లెవేముల గ్రామం నుంచి కలుగోట్లపల్లె గ్రామం వరకు 3.3 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డు నిర్మించారు. దీనిని నాణ్యతను శుక్రవారం జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఈఈ మురహరి రెడ్డి పరీక్షించారు. కల్వర్టు నిర్మాణం పూర్తి కావల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా క్వాలిటీ కంట్రోల్ డీఈ మోహన్‌రావు, ఏఈ నాగలక్ష్మయ్య, పంచాయతీ రాజ్ ఏఈ కొండారెడ్డి, కాంట్రాక్టర్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

కల్తీ విత్తనాలతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి



చిన్నకంబలూరు వద్ద వరి పైరును పరిశీలిస్తున్న నాయకులు

రుద్రవరం: విత్తనాల కల్తీతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామంలో పలువురు రైతులు ఖరీఫ్ సీజన్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే, విత్తనం కల్తీ జరగడంతో పంట సరిగ్గా లేదు. ఈ విషయం తెలుసుకున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సహాయ కార్యదర్శి సురేష్ తదితరులు శుక్రవారం గ్రామానికి చేరుకుని బాధిత రైతులతో మాట్లాడారు. పంట పొలాలు పరిశీలించారు. ఎకరాకు రూ. 45 వేలు ఖర్చు చేశామని, తీరా పంటలు చూస్తే సరిగ్గా లేవని రైతులు వాపోయారు.

మూషికాలతో ముప్పు!

- పిలక దశలో వరి పైరు
- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్ లో తీవ్ర నష్టం



నంద్యాల(అర్బన్): మూషికాలు(ఎలుకలు) అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను మూషికాలు తినేస్తూ దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. వీటి బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాధారణ వరి సాగు విస్తీర్ణం 9,010 హెక్టార్లు కాగా 7,514 హెక్టార్లలో సాగైంది. ప్రధానంగా ఎన్‌డీఎల్‌ఆర్(నంద్యాల సన్నలు), 5204 (కర్నూలు సోనా) రకాలను మాత్రమే సాగు చేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా జూలై చివరి నాటికి నాట్లు పూర్తి చేశారు. చాలాచోట్ల సాలు వరి సాగు అయ్యింది. ప్రస్తుతం దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళ్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఎలుకలను నివారించే వ్యవస్థ ఇప్పటి వరకు లేదు. ఈ క్రమంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఎలుకలను సామూహికంగా నివారించేందుకు వాటిని పట్టే బుట్టలు గానీ బ్రోమోడ యోలిన్ మందును కాని సర్కారు పంపిణీ చేయాలి. అయితే, ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివారణకు ఇలా చేయాలి

- సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలు పొందవచ్చు.
- బ్రోమోడయాలిన్ 0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు రెండు శాతం విషపు ఎరగా తయారీ కోసం 96 పాళ్ల నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడయాలిన్ మందును కలపాలి.
- విషపు ఎర తయారు చేసే సమయంలో చేతులకు గౌజులు లేదా పాలిథిన్ సంచి తొడుక్కోవాలి. లేదంటే మందులో ఉండే మనిషి చేతి వాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- ఒక్కో సజీవ ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి ఎలుక బొరియల్లో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అర్పిన అనంతరం బొరియను మూసి వేయకూడదు. భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే తగ్గే వరకూ చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు.
- కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టే ఈ మిశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రం లోపు అమర్చాలి. ఎలుకలు నిశాచరులు కాబట్టి సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ స్వీకరిస్తాయి. ఆ సమయంలో మందు తిన్న ఎలుకలు నాలుగు నుంచి ఐదు రోజులకు చనిపోతాయి.

పొగ పెట్టినా ప్రయోజనమే

పొగ బారించే యంత్రం (బర్రోవ్యూమీ గేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి,పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల తర్వాత భూమిని దుక్కి చేయాలి. రైతులు పొలం గట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎర ను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి.ఎలుక బొరియలను గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

రైతులు దృష్టి పెట్టాలి

రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. వరి దుబ్బులు తీపిగా ఉండడంతో పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. విషపు ఎరలు పెట్టడంతో పాటు ట్రాక్‌లు, పొగ బారించే పద్ధతులు అవలంబించాలి. బొరియలను గుర్తించి అందు లో విషపు ఎరలు, ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎ లుకల బుట్టలను సైతం ఉంచితే అవి చిక్కి పొలాల్లోకి వెళ్లవు. ఇది రైతులంతా సామూహికంగా చేపట్టాలి.

–ప్రసాదరావు, ఏఓ, నంద్యాల

రహదారుల మరమ్మతులకు నిధుల విడుదల

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులకు రూ. 36.55 లక్ష లు మంజూరైనట్లు ఆ శాఖ డీఈ సునీల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె రహదారిలో 26 కిలోమీటర్ల పొడువున గుంతలు పూడ్చేందుకు రూ. 8.50 లక్షలు, ఆళ్లగడ్డ, మాయలూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో 6వ కిలో మీటర్ నుంచి 18వ కిలో మీటర్ వరకు రూ. 4.50 లక్షలు, కోవెలకుంట్ల, జమ్మలమడుగు ప్రధాన రహదారి నుంచి ఒంటెద్దుపల్లె రోడ్డు మరమ్మతులకు రూ. 4.50 లక్షలు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల రోడ్డుకు రూ. 4.50 లక్షలు, గుళ్లదుర్తి, హరివరం రోడ్డుకు రూ. 3.50 లక్షలు, పెద్దయమ్మనూరు, కాకరవాడ రోడ్డుకు రూ. 5 లక్షలు, అలాగే కోవెలకుంట్ల ఆర్‌అండ్‌బీ సెక్షన్ పరిధిలో వంద కిలో మీటర్ల రహదారుల్లో ఇరు వైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించేందుకు రూ. 6 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలో పై రహదారుల్లో పనులు ప్రారంభించనున్నట్లు డీఈ వెల్లడించారు.

ప్రిన్సిపాల్‌గా ఇంద్రావతి

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభు త్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఇంద్రావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి పదవీ విరమణ చేయడంతో ఈ నియామకం జరిగింది. కాగా నూతన ప్రిన్సిపాల్ కర్నూల్ మెన్ గవర్నమెంట్ కాలేజీ నుంచి బదిలీపై వచ్చారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



దొర్నిపాడు..అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్



ఉయ్యాలవాడ..గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. శుక్రవారం మండలంలోని క్రిష్టిపాడులో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి 90 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ మాధవ, మండల సర్వేయర్ నాగప్రసాద్, వీఆర్‌ఓ సాంబశివుడు, సర్పంచి శివరామిరెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, కట్టుబడి బాషా, సర్వేయర్ గంగాధర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సభలు

ఉయ్యాలవాడ : రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని కొండుపల్లె గ్రామంలో గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామసభలో ఎక్కువ శాతం రైతులు భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

గ్రామ సభకు 24 అర్జీలు

శిరివెళ్ల: గోవిందపల్లెలో శుక్రవారం రీ– సర్వే గ్రామ సభ జరిగింది. భూ సమస్యలపై 24 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఆర్‌ఐ సుచరిత, సర్వేయర్ చిన్న మల్లయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎం. కృష్ణాపురంలో 40 దరఖాస్తులు

గోస్పాడు: మండలపరిధిలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు 40 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఈ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

చాగలమర్రి: రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను పరిష్కరిస్తామని డీటీ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని డి.వనిపెంట సచివాలయలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, సర్వేయర్ మద్దిలేటి, వీఆర్‌ఓ షోయబ్, సచివాలయ సర్వేయర్లు, పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగుల మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆల్‌మేవా నాయకులు

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర మైనార్టీ ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ నాయకులు మహమ్మద్ రఫీ, మహమ్మద్ గౌస్ అన్నారు.శుక్రవారం వారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనార్టీ ఉద్యోగులందరూ ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27వ తేదీన నేషనల్ పీజీ కళాశాలలో నిర్వహించే మహాసభలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమానికి మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, కలెక్టర్ రాజకుమారి, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడమే లక్ష్యంగా ఈ సభలు జరుగుతున్నాయన్నారు.

నేర నియంత్రణలో పోలీసుల పాత్ర అమోఘం



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు



పరీక్ష రాస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

నంద్యాల(సిటీ): ప్రస్తుత సమాజంలో నేరాల కట్టడిలో పోలీసుల పాత్ర అమోఘమని జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు అన్నారు. శుక్రవార స్థానిక కార్యాలయ ఆవరణలో వివిధ అంశాలపై పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతలో పాటించాల్సిన మెలకువలు పెంపొందించుకోవాలన్నారు. సైబర్ క్రైమ్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి మొదటి బహుమతి కింద రూ.5వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3వేలు, తృతీయ బహుమతి కింద రూ.2వేలు అందించనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

శిరివెళ్ల: ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, దీని గురించి ప్రతి విద్యార్థి తెలుసుకుని జాగ్రత్త పడాలని ఎస్‌ఐ చిన్న పీరయ్య సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం సమాజంలో పోలీస్ పాత్ర, సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు ఎస్‌ఐ బహుమతులు అందించారు.

అవీ-ఇవీ

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

మహానంది: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ ఎఫ్‌డీపీటీ బీవీఎస్ కృష్ణమూర్తి తెలిపారు. అటవీశాఖ సిబ్బంది విధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మహానందిలోని పర్యావరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అటవీశాఖ నూతనంగా తీసుకొచ్చిన ఎమ్ స్ట్రైప్స్ యాప్‌పై జిల్లాలోని అన్ని రేంజ్‌లలో పనిచేస్తున్న ఎఫ్‌ఆర్‌ఓలు, ఎఫ్‌ఎస్‌ఓలు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అడవుల్లో చేపట్టే విధుల సమయంలో ఎలాంటి ప్రాధాన్యత అంశాలు గుర్తించినా, ప్రత్యేకతలు కనిపించినా వెంటనే ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరచాలన్నారు. పులుల సంరక్షణ, పులుల గణనలో ఎన్‌ఎస్‌టీఆర్‌కు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. పులుల సంగమం సమయంలో అడవుల్లోకి ఎవరికీ ఎలాంటి అనుమతి ఉండదని, ఎవరైనా అడవిలోకి వెళితే కఠినచర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, ఏసీఎఫ్ ధనరాజ్, హైటికాస్ ప్రతినిధి దూపాడు శ్రీధర్, నంద్యాల, రుద్రవరం, చలమ రేంజ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ నేత్ర దానం



రమామహేశ్వరి (ఫైల్)

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల 36వ వార్డు మాజీ కౌన్సిలర్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రమామహేశ్వరి (50) శుక్రవారం మరణించడంతో కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. ఆమె భర్త పట్టణ వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త వెంకటేష్‌యాదవ్ మాట్లాడుతూ.. శుక్రవారం తెల్లవారుజామున తన భార్య గుండెపోటుతో మరణించినట్లు చెప్పారు. 2000 సంవత్సరం నుంచి 2005 వరకు 36వ వార్డు కౌన్సిలర్‌గా పని చేసి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేసుకున్నారు. రెండున్నరేళ్లపాటు అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆమె ఆశయం మేరకు రెండు కళ్లను హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ వారికి కుటుంబసభ్యులు అందజేశారు. ఆమె మృతికి మాజీ ఎంపీ పోచాబ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ మంత్రి శిల్పామోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా సంతాపం వ్యక్తం చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: స్థానిక కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవను ఈఓ నల్లకాలువ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, ఆంజనేయశర్మ, అర్చకులు శరభయ్యశర్మ వైభవంగా నిర్వహించారు. ముందుగా అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతిపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్



పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(రూరల్): దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి మంత్రి పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ పశుగణన కోసం ఇంటి వద్దకు వచ్చే అధికారులకు పాడిరైతులు సహరించాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా అధికారి గోవింద్‌నాయక్, జిల్లా కార్యాలయ అధికారులు శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పశుగణనకు శ్రీకారం

రుద్రవరం: ఈనెల 24 నుంచి పశుగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇది వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగుతుందని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, పశు వైద్యాధికారి ప్రతాప్ అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం వారు పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలేజ్ వెటర్నరీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశుగణన చేపడతారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ సుబ్రమణ్యం, పీఆర్‌ఏఈ కమాల్ సాహెబ్ ఉన్నారు.

పాడి రైతులు సహకరించాలి

చాగలమర్రి: పశుగణన కార్యక్రమానికి మండలంలోని పాడి రైతులందరూ సహకరించాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ కోరారు. శుక్రవారం ఎంపీపీ వీరభద్రుడుతో కలిసి ఆయన పశుగణన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టరును విడుదల చేశారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామా పంచాయితీల పరిధిలో పశుగణన జరుగుతుందన్నారు. పశు సంపద కలిగిన రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రవి, దీప తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

రుద్రవరం:మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని హర్షిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ నెల 24న నంద్యాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. ఇందులో ఆ విద్యార్థిని మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 27,28,29 తేదీల్లో రాయచోటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో హర్షిత పాల్గొంటుందన్నారు. అనంతరం ఆ విద్యార్థితో పాటు పీడీ శ్రీనివాసులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ముగిసిన ఫెన్సింగ్ క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అండర్–14 రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు శుక్రవారం ముగిశాయి. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ శ్రీనాథ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి రాజు, డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎంపికైనటువంటి క్రీడాకారులు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలన్నారు.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): వెలసిటీ జూనియర్ కాలేజీకి చెందిన షాహీద్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు.పట్టణంలోని నంది బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ విద్యార్థి ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆ విద్యారిని ప్రత్యేకంగా అభినందించి క్రీడల్లో జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.

అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి అండర్–19 బాలబాలికలు అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 900 మంది క్రీడాకారులు తరలి వచ్చారు. వీరికి టౌన్ జూనియర్ కళాశాల, కోల్స్ జూనియర్ కళాశాల, స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో విడిది ఏర్పాటు చేశారు. అంతకు ముందు మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేశ్, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి పెంచుకుని సాధన చేస్తే సులువుగా రాణించగలుగుతారని చెప్పారు.

వర్షం మిగిల్చిన నష్టం!



క్రిష్టిపాడు వద్ద రంగుమారిన పొగాకు పంట



దొర్నిపాడు శివారులో ఎండుతున్న కందిపైరు

గత పదిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో పలు పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పత్తి, మిరప, జొన్న, మినుము, మొక్కజొన్న పంటలకు అపారనష్టం వాటిల్లింది. పొలాల్లో వారం పాటు నీరు నిలిచిపోయి ఉండటంతో కంది, పొగాకు పంటలు ఏకంగా ఎండుముఖం పట్టాయి. నీరుకుట్టు తీసుకోవడం వల్లే ఇలా జరిగిందని రైతులు చెబుతున్నారు. పంటల సాగుకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, తీరా తుపాను ఎఫెక్ట్‌తో ఆశలు ఆవిరయ్యాయని వారు వాపోతున్నారు. దొర్నిపాడు మండలంలో కొందరు రైతులు దెబ్బతిన్న పంటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

–దొర్నిపాడు

వాల్మీకి సంఘం నూతన కమిటీ ఏర్పాటు



దొర్నిపాడు వాల్మీకి సంఘం నూతన కమిటీ

దొర్నిపాడు: ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతినాయుడు, జిల్లా అధ్యక్షుడు అర్జున్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమద్దిలేటి, కార్యదర్శి బాల ఉసేని ఆధ్వర్యంలో శుక్రవారం మండల, గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. దొర్నిపాడు మండల అధ్యక్షుడిగా జుమ్ముల రామదాసు, బుర్రారెడ్డిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నాగేష్, కార్యదర్శిగా నాగశేషుడు, చాకరాజువేముల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బాలదాసు, ఉపాధ్యక్షుడిగా అంజనేయులు, కార్యదర్శిగా బాలయ్య, దొర్నిపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లె పెద్ద ఉసేని, ఉపాధ్యక్షుడు కోవెలకుంట్ల శ్రీనివాసులు, కార్యదర్శి కృష్ణయ్యను నూతనంగా ఎన్నుకున్నారు.